అరకొరగా అపరాలు రాక

- రెండో పంట మినుము 30 వేల ఎకరాలు సాగు చేసే అవకాశం
- పెడన నియోజకవర్గానికి వచ్చిన మినుములు 18.23 టన్నులు మాత్రమే
- సబ్సిడీపై ఇవ్వాలంటున్న రైతులు


రెండో పంట మినుము వేసేందుకు దుక్కి దున్నుతున్న ట్రాక్టరు

పెడన:దాళ్వాకు సాగునీరు ఇవ్వడం లేదని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు రెండో పంటగా అపరాలను సాగు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రతి సంవత్సరం అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా రైతులకు సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయడం అనవాయితీ. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులకు సబ్సిడీ విత్తనాలను అందిస్తున్నామని పేర్కొంటూనే బయట మార్కెట్ కంటే అధికంగా విక్రయించడం విస్మయానికి గురి చేసింది. నియోజకవర్గంలో 58 వేల ఎకరాల్లో వరి సాగయింది. రెండో పంట మినుము సుమారు 30 వేల ఎకరాలకు వరకు సాగయ్యే పరిస్థితి ఉందని వ్యవసాయశాఖాధికారుల అంచనా. ప్రభుత్వ గణాంకాల మేరకు ఎకరానికి 16 కిలోలు మినుము విత్తనాలను మించి ఇవ్వడం లేదు. కానీ రైతు మాత్రం ఎకరానికి 20 కిలోల నుంచి 25 కిలోలు వరకు విత్తనాలను జల్లుతున్నారు. మరికొందరు 30 కిలోలు వరకు కూడా జల్లుతున్న రైతులు ఉన్నారు.

వచ్చింది 18.24 టన్నులు మాత్రమే..

పెడన నియోజకవర్గంలో 30 వేల ఎకరాల్లో మినుము సాగయ్యే పరిస్థితి. ఇందుకు 30,000 ఎకరాలకు 16 కిలోలు చొప్పున 480 టన్నులు మినుము విత్తనాలు అవసరం. కానీ పెడన నియోజకవర్గానికి ఇప్పటి వరకు 18.24 టన్నులు మాత్రమే కేటాయించారు. పెడన మండలానికి 9.024 టన్నులు, గూడూరు మండలానికి 7.008 టన్నులు, కృత్తివెన్ను మండలానికి 2 టన్నులు పంపించారు. పెడనలో 17 రైతు సేవా కేంద్రాలులుండగా కేవలం 12 ఆర్ఎస్‌కేలకు మాత్రమే 9 టన్నులు పంపించారు. వీటిల్లో ఉరివి గ్రామానికి 2 టన్నులు పంపించడం విశేషం. మిగిలిన మండలాలకు తక్కువగా పంపించడం ఏమిటంటూ ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా పలువురు సభ్యులు వ్యవసాయశాఖాధికారులను నిలదీశారు. దీనిపై సరైన సమాధానం ఇచ్చేవారు కరువయ్యారు. గూడూరు మండలంలో 17 ఆర్ఎస్‌కేలకు 12 ఆర్ఎస్‌కేలకు 7 టన్నులు పంపించారు. రామారాజుపాలెం ఆర్ఎస్‌కేకు ఒక టన్ను విత్తనాలు కేటాయించి మిగిలిన చోట్ల అరకొరగా కేటాయించారు. కృత్తివెన్ను మండలంలో 16 ఆర్ఎస్‌కేలుంటే కేవలం మూడు ఆర్ఎస్‌కేలకు మాత్రమే 2 టన్నులు పంపించి చేతులు దులుపుకున్నారనే వాదన రైతుల నుంచి వ్యక్తమవుతుంది.

బయట మార్కెట్‌లో కొనుగోలు చేశాను



అదును దాటిపోతుందని బయట మార్కెట్‌లో కొనుగోలు చేశా. వాటిని నానబెట్టి విత్తనాలు జల్లుకున్నా. బయట మార్కెట్‌లో కూడా అదే ధర ఉంది. మరికొందరు రైతులు మరికొన్ని చోట్ల రైతు కేంద్రాల్లో కంటే బయట మార్కెట్‌లోనే తక్కువగా ఉందంటున్నారు. నేను క్వింటా రూ.9,500 రేటు ప్రకారం నా మూడు ఎకరాలకు మినుములు కొనుగోలు చేశా. ఎకరానికి 20 కిలోలు వినియోగించాను.

ఎస్.సాంబశివరావు, రైతు, పెడన

రైతులకు మేలు చేయాలి



ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రైతుకు ఉపయోగం లేకుండా పోయింది. బయట మార్కెట్‌లో కూడా అదే ధరకు మినుములు వస్తున్నాయి. కొన్ని చోట్ల ఇంకా తక్కువగా ఇస్తున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు కొనుగోలు చేయడం లేదు. అదీ కాకుండా విత్తనాలు సరఫరా కూడా తక్కువగా ఉంది. కాబట్టి రైతులకు మేలు కలిగే విధంగా సబ్సిడీ పెంచి రైతులకు అపరాలను అందించాలి.

వన్నెంరెడ్డి మహకాళరావు, రైతు, పెడన

డిమాండ్‌ను బట్టి రప్పిస్తాం



రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి మాకు మినుము విత్తనాలు కావాలని లిఖితపూర్వకంగా తెలియజేస్తే వారికి మినుములు రప్పిస్తాం. ఒకరిద్దరు కాకుండా బల్క్‌గా పెద్ద సంఖ్యలో రైతులు ముందుకు రావాలి. మినుము విత్తనాలకు డిమాండ్ ఉందంటే దానిని బట్టి సప్లయి ఉంటుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు సబ్సిడీ ఇవ్వడం జరిగింది. ఎల్‌బీజీ 752 విత్తనాలను మాత్రమే ఆర్ఎస్‌కేలు ద్వారా విక్రయిస్తున్నాం.

నూరున్నీసా, ఇన్‌చార్జి ఏవో, పెడన

క్లుప్తంగా

పోలీస్ ఫొటోగ్రాఫర్‌కు ఎస్పీ అభినందనలు



కోనేరుసెంటర్:పోలీస్ ఫొటోగ్రాఫర్‌ను జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం అభినందించారు. ఇటీవల జిల్లా పోలీస్‌పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ఫొటోగ్రాఫర్ దొరబాబు (కానిస్టేబుల్) క్రీడలకు సంబంధించి మంచి కవరేజీ ఇవ్వటంతో పాటు అద్భుతమైన దృశ్యాలను తన కెమెరాలో బంధించి అధికారుల మన్ననలు అందుకున్నాడు. దీంతో ఎస్పీ గురువారం దొరబాబును అభినందిస్తూ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విధి నిర్వహణతో పాటు ఫొటోగ్రఫీలో మంచి ప్రావీణ్యం సంపాదించిన దొరబాబు పోలీసుశాఖలో మంచి ఫొటోగ్రాఫర్‌గా గుర్తింపు తెచ్చుకోవటం అభినందనీయమని ఎస్పీ తెలిపారు.

క్రీడలకు అవసరమైన గ్లౌజ్‌లు బహూకరణ



నాగాయలంక:స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌కు చెందిన 14 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికైన నేపథ్యంలో పాఠశాలకు దాత 7 వేల రూపాయలు వితరణ చేసారు. అవనిగడ్డకు చెందిన మునిపల్లి శ్రీధర్ జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు మునిపల్లి వెంకటేశ్వరరావు, సంపూర్ణమ్మ సమకూర్చిన మొత్తంతో తీసుకున్న బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ క్రీడలకు అవసరమైన గ్లౌజ్‌లను రాష్ట్ర స్థాయి సెలక్షన్స్‌లో వెళ్తున్న బాలికలకు గురువారం హెచ్ఎం ఎ.పద్మజ చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల పీడీలు గాజుల లక్ష్మీప్రసాద్, కోసూరు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మోపిదేవి: రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ లక్ష్మీనాథ్ తెలిపారు. మోపిదేవి జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ స్క్రీనింగ్‌లో భాగంగా బీపీ, హిమోగ్లోబిన్, షుగర్, రక్తపరీక్షలతో పాటు ఎత్తు, బరువు, చెస్ట్ కొలతలు తీసుకున్నారు. ఒక్కో విద్యార్థికి ఒక్కో హెల్త్ కార్డు కేటాయించి, దానిలో ఆరోగ్య వివరాలు నమోదు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు గుంత పూడ్చివేత



తెలుగురావుపాలెం(ఘంటసాల): రెండేళ్ల క్రితం వెల్‌నెస్ సెంటర్ కోసం తవ్వించిన భారీ గుంతను ఎట్టకేలకు దాతల సహకారంతో పూడ్చించినట్లు తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్ బాబు తెలిపారు. వెల్ నెస్ సెంటర్ నిర్మించేందుకు పునాదుల కోసం సుమారు ఏడు ఎనిమిది అడుగుల భారీ గుంతను తవ్వించారు. దీంతో అప్పటి నుంచి నేటి వరకు గుంత పూడ్చకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందారు. గ్రామానికి చెందిన గుత్తికొండ చారిటబుల్ ట్రస్టు అధినేతలు గుత్తికొండ కళ్యాణ్, రవి బాబు ఆర్థిక సహకారంతో గుంతను పూడ్చడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సర్పంచ్ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

108 వాహనంలో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం



చల్లపల్లి(అవనిగడ్డ): లక్ష్మీపురానికి చెందిన తుమ్మా వీరమ్మ 108 వాహనంలో ప్రసవం అయింది. బుధవారం అర్ధరాత్రి వీరమ్మకు పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. చల్లపల్లికి చెందిన 108 వాహనం పైలట్ షఫీ, ఈఎంటీ దాసి బసవరాజు, ఆశావర్కర్ ఎస్. పార్వతితో కలసి వీరమ్మను మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో వాహనంలో ప్రసవం అయ్యింది. తల్లీబిడ్డా క్షేమంగానే ఉన్నారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.

ధాన్యం సేకరణలో నిబంధనలు సడలింపు



ఘంటసాల: తుఫాను కారణంగా వర్ష సూచనల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించే నిబంధనలను తాత్కాలికంగా సడలించినట్లు ఏవో కె.మురళీకృష్ణ గురువారం తెలిపారు. మిల్లులకు ధాన్యం తరలించాలనుకునే రైతులు ముందుగా గ్రామ వ్యవసాయ సహాయకుడిని ఫోన్ లేదా స్వయంగా సంప్రదించి కేవలం 10 నిమిషాల్లో షెడ్యూలింగ్ చేస్తారన్నారు. అనంతరం రైతులు దగ్గరలోని మిల్లులకు తగు అనుమతితో జీపీఎస్ లేని వాహనం ద్వారా ధాన్యం తరలించవచ్చని చెప్పారు. వెంటనే రైతులు ధాన్యం తరలించిన తాలూకా రశీదులను ధాన్యం కొనుగోలు కేంద్రంలో సమర్పిస్తే ఆన్‌లైన్ చేసి ట్రక్ షీట్ అందిస్తారని తెలిపారు. రైతులు లేదా వారి ప్రతినిధులు వేలి ముద్రలు వేసిన ఎడల రైతు ఆధార్ అనుసంధానం అయిన బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని ఐదు డ్రైయర్ సౌకర్యం ఉన్న మిల్లులతో పాటు చుట్టు పక్కల మండలాల్లోని మిల్లులకు కూడా ధాన్యం తరలించుకునే సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. మిల్లుకు ధాన్యం తరలించే రైతులు ముందుగానే కొనుగోలు కేంద్రాల్లో సమాచారం ఇవ్వాలని దానికి అనుగుణంగా వాహనాలు, గోనె సంచులు, మిల్లులు వంటి ఏర్పాట్లు చేస్తామని వివరించారు. ఘంటసాల మండలంలోని మిల్లుల గోడౌన్లలో 15 రోజులకు సరిపడా ధాన్యం నిల్వలు ఉన్నాయని తెలిపారు.

జ్యోతిరావ్‌పూలే ఆశయాలు ఆదర్శనీయం

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ:సమాజంలో ఉన్న అంతరాలను తొలగించి, బడుగు, బలహీన, నిమ్న వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహాత్మాజ్యోతిరావ్‌పూలే ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని మాజీ శాసనసభ్యులు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ సింహాద్రి రమేష్‌బాబు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం జ్యోతిరావ్‌పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే సింహాద్రి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలితరంలో మహిళలకు విద్య నేర్పించడంతో పూలే దంపతులు ఎంతో పాటుపడ్డారని కొనియాడారు. సామాజిక రుగ్మతలను పారదోలేందుకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత సింహాద్రి వికాస్, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, పార్టీ యువజన విభాగ రాష్ట్ర సహాయ కార్యదర్శి గాజుల జయగోపాల్, రైతు నాయకుడు సామర్ల రాముడు, మధుసూదనరావు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా పోటీలకు గూడూరు విద్యార్థులు



గూడూరు:జిల్లా స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో సత్తా చాటిన గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం డి.పుష్పలత తెలిపారు. అండర్-17 విభాగం రగ్బీ విభాగంలో 10వ తరగతి విద్యార్థి బాలిరెడ్డి రుత్విక్ గుంటూరు జిల్లా వెనిగండ్లలో శుక్రవారం జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు కృష్ణా జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు వెల్లడించారు. అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పదవ తరగతి విద్యార్థిని నిమ్మలూరి నాగభవాని శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి బిక్కవోలులో జరిగే పోటీలకు కృష్ణా జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. అండర్-14 త్రోబాల్ విభాగంలో ఎంపికైన 8వ తరగతి విద్యార్థి చెన్నకేశవ మహిధర్ చిత్తూరు జిల్లా పూతలపట్టులో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలు మత్తి అరుణ, చిలుకోటి రాజేష్‌లను ఆమె అభినందించారు.

అన్నపూర్ణదేవికి ప్రసాదంగా వరి ధాన్యం


భావదేవరపల్లిలో వరి పంటతో అన్నపూర్ణాదేవి అలంకారం


అర్ధనారీశ్వర స్వరూపంలో కాశీవిశ్వేశ్వరస్వామి

భావదేవరపల్లి(నాగాయలంక): అన్నపూర్ణదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణ దేవికి వరి ధాన్యం ప్రసాదంగా అర్చకుడు బ్రహ్మశ్రీ కె.సుబ్బారావు సమర్పించారు. తొలుత ఆయన బ్రహ్మత్వంలో గురువారం వరి పంటను అమ్మవారికి నివేదించి తదుపరి ఆ వరి కంకులతో అన్నపూర్ణదేవిని శోభాయమానగా అలంకరించారు. అలాగే విశ్వేశ్వర స్వామిని నీలి, పసుపు రంగులతో అర్ధనారీశ్వర స్వరూపంతో తీర్చిదిద్దారు. వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు. నాగాయలంకలోని పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరి సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు బ్రహ్మత్వంలో స్వామిని ఆయనకు అత్యంత ప్రీతిపాత్రమైన నాగమల్లి పుష్పాలతో అర్చన చేసి తదుపరి వాటితోనే సుందరంగా అలంకరించారు. తొలుత సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకాలు చేశారు.

● ధనేశ్వరుడైన శ్రీరామలింగేశ్వరుడు


రూ.లక్షన్నర నాణేలతో అలంకరించిన రామలింగేశ్వరుని పూజ వైభవం


నందీశ్వరునికి స్వీయ అభిషేకాలు చేస్తున్న భక్తులు

కార్తిక త్రయోదశి మాస శివరాత్రి పురస్కరించుకుని నాగాయలంక కృష్ణానది తీరంలోని శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీరామ లింగేశ్వర స్వామిని రూ.లక్షన్నర నాణేలతో అత్యంత వైభవంగా అలంకరించారు. కమిటీ సభ్యులు ద్వారా సమకుర్చిన రూ.5, రూ.10 నాణేలను అత్యంత ఓర్పుగా ఆధ్యాత్మిక సేవకులు భారీ రామలింగేశ్వర శివలింగానికి అమర్చి అలంకరించారు. కమిటీ నేతృత్వంలో బ్రహ్మశ్రీ అంబా సాయి కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో ధనేశ్వరుడిగా రూపొందిన స్వామికి విశేష పూజ జరిపారు. ఉప్పల లీలాకృష్ణప్రసాద్, తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకటనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

-నాగాయలంక

సుబ్బారాయుడు ఆస్తులకు రక్షణగా ప్రహరీ నిర్మాణం



మోపిదేవి: శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంకు చెందిన సర్వే నంబర్ 633 చెరువుకు దక్షిణ వైపు ప్రహరీ నిర్మిస్తున్నట్లు గురువారం ఆలయ డెప్యూటీ కమిషనర్ శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. గతంలో ఉన్న ఔట్‌పోస్ట్ షెడ్‌ను తొలగించినందున జిల్లా సర్వేయర్లు నిర్ధారించిన హద్దులను అనుసరించి దేవస్థానం భూమికి రక్షణ కోసం ఈ ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు వివరించారు.

నిమ్మకాయలతో నిటలాక్షుడి అలంకరణ


రామలింగేశ్వరునికి పూజ చేసిన దాతలు, సామాన్య భక్తులు

నాగాయలంక: కృష్ణానది తీరంలోని శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీరామ లింగేశ్వరస్వామి మండపంలో బుధవారం రాత్రి నిమ్మకాయలతో జరిపిన అలంకారంతో నిటలాక్షుడు ధగధగ మెరుపులతో భక్తులను అలరించాడు. అర్చకుడు బ్రహ్మశ్రీ అంబా సాయి కిరణ్ శర్మ బ్రహ్మత్వంలో అభిషేకం, పూజ చేశారు. భక్తులు భక్తి పారవశ్యంతో సమర్పించిన సుమారు మూడు వేల నిమ్మకాయలతో స్వామికి అలంకరణ చేశారు. నిత్య కోటివత్తుల జ్యోతి ప్రజ్వలన, నవ హారతులతో భక్తులకు నేత్రపర్వమైంది. క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు దంపతులు, క్షేత్ర పాలకుడు తలశిల రఘుశేఖర్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్, నారాయణ, బోయపాటి రాము, పర్యవేక్షించారు.

వర్తక, వాణిజ్య మండలి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన


కార్తికవన సమారాధనలో పాల్గొన్న దంపతులు, బాలరాజు తదితరులు

పెడన:కార్తీకమాసం సందర్భంగా వర్తక వాణిజ్య మండలి ఆధ్వర్యంలో గురువారం కార్తీకవన సమారాధన నిర్వహించారు. బంటుమిల్లి రోడ్డులోని చిట్టూరు మాధవరావు తోటలో ఏర్పాటు చేసిన ఈ వన సమారాధనలో పలువురు దంపతులు దామోదరవ్రతాన్ని ఆచరించారు. ఉసిరి, రావి చెట్లుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన కార్తికవన సమారాధనలో పట్టణంలోని దుకాణాదారులు కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో హాజరై కార్తికవన భోజనాలు చేశారు. వర్తక వాణిజ్య మండలి పట్టణ అధ్యక్షుడు బొలిశెట్టి సత్య నాగ బాలరాజు, కార్యదర్శి కొల్లిపర శ్రీనివాసరావు, కోశాధికారి నంబూరు లక్ష్మణరావు, సభ్యులు వీరమల్లు వెంకటరత్నం, భవిరిశెట్టి నాగేశ్వరరావు, కొమ్మూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనే దిక్కులేదంటూ ఆందోళన


ఘంటసాల గ్రామంలో వరియంత్రంతో కోసిన ధాన్యం రాశులు

ఘంటసాల:రైతులు పండించిన 1262, 1318, బీపీటీ ధాన్యం కొనే దిక్కులేకుండా పోయిందంటూ పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘంటసాల, దేవరకోట తదితర గ్రామాల్లో 1061తో పాటు 1262, 1318, బీపీటీ రకాలను రైతులు పండించారు. ప్రస్తుతం తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు పంటను కాపాడుకునేందుకు చేతికొచ్చిన పంట నేలపాలుకాకుండా ఉండేందుకు వరి యంత్రాల ద్వారా ధాన్యం సేకరించి అయినకాడికి అమ్ముకోవడానికి సిద్ధపడతుంటే ప్రభుత్వ నిబంధనలు తీవ్ర ఆటంకంగా మారాయంటూ ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో రైస్ మిల్లర్లు ఏ వెరైటీ ధాన్యమైనా మద్దతు ధరకు వద్దనకుండా తీసుకునేవారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో 1061 ధాన్యం మాత్రమే తేమ శాతంతో సంబంధం లేకుండా రూ.1500 కు కొంటున్నారు. రెండు రోజుల్లో నగదు వస్తున్నాయి. కానీ రైతులు రూ.100 వరకు నష్టపోతున్నారన్నారు. ఇక పోతే రైతులు అధిక దిగుబడులు వస్తాయని సాగుచేసిన 1262, 1318, బీపీటీ వంటి ఇతర రకాలైతే కొనే దిక్కులేదంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అయా రకాల కొనకపోతే ఎవరి దగ్గరకి వెళ్లాలి, అధికారులు ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్‌కు కాల్ చేస్తే లిఫ్ట్ చేయడం లేదని, ఎంతమంది రైతులు తహసీల్దార్‌లకు, జాయింట్ కలెక్టర్లకు ఫోన్ చేస్తారు, ఏ ఒక్క అధికారైనా రోడ్లమీద ఉన్న ధాన్యాన్ని శాంపిల్ గా ట్రాక్టర్‌లో లోడ్ చేసి రైతు సేవా కేంద్రాల్లో ట్రక్ షీట్‌తో ఒక్క రైస్ మిల్లుకు తీసుకెళ్లి అమ్మి పెట్టమనండి మా బాధలు తెలుస్తాయంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం ఆరబెట్టుకుందామంటే వానల భయం, పోని ఆరబెట్టుకున్న తర్వాత నెల రోజుల తర్వాత అమ్ముకుందామంటే రైతుల దగ్గర గోడౌన్లు లేక ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి ధాన్యం రకాలతో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు ప్రతి ఊరిలో చిన్నదో పెద్దదో డ్రైయర్ పెట్టి, గోడౌన్ సౌకర్యం కలిపిస్తే కానీ ధాన్యం రైతులు బాధలు తీరవని దేవరకోట గ్రామానికి చెందిన దోనేపూడి గోపికృష్ణ చెప్పారు.


దోనేపూడి గోపికృష్ణ, రైతు, దేవరకోట

కాలువలో వ్యక్తి గల్లంతు

కె కొత్తపాలెం(మోపిదేవి):కేఈబీ కెనాల్ వద్ద 9వ నంబర్ కాలువలో పడమట సుబ్రహ్మణ్యం (27) అనే వ్యక్తి బుధవారం రాత్రి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో కాలువ వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లిన పడమట సుబ్రహ్మణ్యం, వీరంకి ఏడుకొండలు (సుందరరామయ్య) గొడవ పడి కాలువలో పడినట్లు తెలిసిందన్నారు. ఈ ప్రమాదంలో ఏడుకొండలు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగా సుబ్రహ్మణ్యం నీటి ప్రవాహంలోకొట్టుకుపోయాడు.

భక్తిశ్రద్ధలతో సాయి దీపోత్సవం



బందలాయిచెరువు(అవనిగడ్డ):అవనిగడ్డ మండల పరిధిలోని బందలాయిచెరువు శ్రీసాయి జ్ఞానమందిరం వద్ద గురువారం శ్రీసాయి దీపోత్సవం కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గురువు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో ఆలయ నిర్వాహకురాలు సింహాద్రి లక్ష్మీ, సాయి సేవక్ కె.ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన సాయిభక్తులు దీపాలు వెలిగించి హారతులిచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సాయిబాబా గీతాలను ఆలపించారు. ఓం, శ్రీసాయి ఆకారంలో ఆకారంలో వెలిగించిన దీపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఘనంగా లక్ష బిల్వార్చన



బంటుమిల్లి: మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో వేంచేసి ఉన్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి ఆలయంలో గురువారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చిట్టా పవన్ కుమార్ పర్యవేక్షణలో పండితుల వేద మంత్రాల మధ్య ఉదయం స్వామి వారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సాయంత్రం లక్ష బిల్వార్చన (మారేడు పత్రి) భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే అమ్మవారికి సహస్ర కుంకుమపూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.